# ప్రేమపాశము

బంగారమ్మ చిన్నపిల్ల: పదునొక్క సంవత్సరము లుండవచ్చును. కానైతే అది పెండ్లియీడే; గాని పెండ్లి చేయుటకు పూనుకొనువారు లేదు. తల్లి యగు కాంతమ్మ నవవైధవ్యము పాల్పడెను. పైగా నామె లజ్జావతి. స్వయముగ వ్యవహారములను నిర్వహించుటకు పూనుకొనగల సాహసమామెకు లేదు. పట్టణము గనుక సంబారములు పొరుగూరు వెళ్ళి తెచ్చుకోనక్కఱలేదు; గనుక చిన్న చిన్న పదార్థములేమైన కావలసివచ్చినచో కూతురుచేతనే తెప్పించుకొనుచు కాలము గడుపుచుండెను.

వేంకటశాస్త్రి మంచి ప్రయోజకుడు. రాజమహేంద్రవరమున వైశ్యుల కాతడనిన ప్రీతి. వాల్మీకిరామాయణము నాతడనేకావృత్తులు పురాణము చెప్పెను, మంచి గాత్రము. జంభోరాకంఠము. తంబురా శృతిమీటుచు పురాణము చెప్పునపుడు ఆతనిని జూచిన "సూతుడు" అని తలంపవలసినదే. ఆతని ఛాయ నలుపే గాని మసిబొగ్గు నలుపుగాదు. ముప్పది యైదవ సంవత్సరమున నాతడు కాలగతి పొందెను.

ఆతనికి బంగారమ్మ యొక్కతెయే కూతురు. తనవలెనే భార్యగూడ పొదుపుకత్తె యగుట వలన నాలుగేండ్ల రాజమహేంద్రవరవాసమున నాతడు ఇన్నీసుపేటలో చిన్ని యిల్లును, పాలకొల్లు ప్రాంతమున రెండు యకరముల మాగాణిభూమిని సంపాదించెను. ఆవసతి గాక ఎప్పటికప్పుడే స్వయంపాకములు వగైరాలు విశేషముగ వచ్చుచుండెను. సంసారము చిగిర్చినది. కాంతమ్మ చామనచాయకు బంగారపు వస్తువులు వన్నెదెచ్చెను. బంగారమ్మకు "బాలతొడుగు" తగినంత యుండెను.

వైశ్యులందఱును "ఇచ్చినది బాగుచేసికోగలవాడు" అని యానందించుచుండిరి. ఆప్తబంధువులు "అదృష్టము మంచిది" అని సంతోషించుచుండిరి. స్వగ్రామవాసులు "లోటులేదు. ఇంకా సంపాదిస్తాడు. ఇంక యిక్కడికి రాడు" అని చెప్పుకొనుచుండిరి; గాని రాజమహేంద్రవరమున వైదికవృత్తి చేసికొనువారు కొందఱు చాలా కాలము నుండి పురాణము చెప్పుచుండు వారు కొందుఱు "ఎన్నాళ్ళు వెలగాలో వెలగనీయండి. నడిమంతరపు సిరి నిలవదయ్యా" అని అసూయపడుచుండిరి.

"అమ్మాయికి వివాహం చెయ్యాలని సంకల్పం గలిగింది. మళ్ళీ మీకోమాటు శ్రమ కలిగించవలసి వస్తుంది" అని యాతడు తన యాశ్రితుల

నందఱను సుముఖులను గావించుకొనుచుండగా ఆకస్మికముగా కలరా వచ్చి యాతనిని మ్రింగివేసెను.

కాంతమ్మకు నలుగురు సోదరులు గలరు; గాని అందఱును జూటాకోరులు. ఆమె వారిని చేరనీయలేదు. పెత్తనము చేసి వెలిగింతమని యొక్కరొక్కరే వచ్చి నిరాకృతులై కోపగించి వెడలిపోయిరి. "ఈ ముండ కూతురికి పెళ్ళి యెలా చేస్తుందో చూద్దాము" అని వారు మఱల గుమ్మము త్రొక్కి చూడలేదు. "అదే బాగుంది" అని యామె యానందించెను.

పేరుభట్టు క్రొత్తగా రాజమహేంద్రవరము ప్రవేశించెను. ఇరువదియేండ్లవాడు.

సంగీతమున ప్రవేశము ఉండుట వలన సాహిత్యము సంపాదించుకొనుట కక్కడకు వచ్చెను. వచ్చి యేడాది కాలేదు. రాజమహేంద్రవరము యొక్క ఆనుపానులు బాగుగ దెలిసిపోయెను. "కాళిదాసత్రయమేనా పూర్తిచేస్తే తరువాత హరికథలు చెప్పి యిక్కడ వకరుగా బతకవచ్చు"నని యాతడు భవిష్యత్తును నిర్మించుకొనియెను.

వేంకటశాస్త్రి చనిపోయిననాటి రాత్రి యాతడు స్వగ్రామము నుండి వచ్చెను. అప్పుడే సంగతి యంతయు తెలిసెను. "దహనసంస్కారం ఎవరో ముసలిబ్రాహ్మణుడు చేశాడు" అని వినియెను. మేనమామకు ఇట్టి గతి పట్టినందులకు ఆతడు చాల తహతహపడెను. ఇది వినుటయే తడవుగ నాతడు బసలో నిలువలేక మేనమామ యింటికి వచ్చెను.

## ②

పేరుభట్టు తల్లియు, వేంకటశాస్త్రియు ఒక్క తల్లి కడుపున బుట్టిరి; గాని యిరువురకును సయోధ్య లేదు. రాకపోకలు లేవు. ముఖావలోకనములు గూడ లేవు. పేరుభట్టు పూర్వవృత్తమును తిరుగవేయదలంపలేదు. "కొంపపడిపోయింది. అత్తకి దిక్కు యెవరూ? ఇలాంటప్పుడు గూడా పగలే చూస్తే రాక్షసకృత్యం" అని తలుచుకొనుచు కాంతమ్మ యొక్క భవిష్యత్తును గుఱించిన యావేశము పారవశ్యము కలిగింపగా వాయువేగములతో బోయి యాతడు "అత్తా"యని తలుపు తట్టెను.

ఎప్పుడును లేని సంగతి. కాంతమ్మ మొదట దిగ్భ్రమ చెందెను. అట్లుండియే తలుపుతీసి యామె పేరుభట్టును జూచి విచారము ఉబుకగా కూలబడియెను. బంగారమ్మ బారుమనియెను. విచారాతిరేకము వలన ఆతనికి అవశత్వము కలిగెను. ఒక్క నిమిషమిట్లు ఉన్న తరువాత నాతడు స్థిరుడై బంగారమ్మను ఒడిలోనికి దీసికొని కాంతమ్మ నూరడించెను.

"జరిగిపోయినదేమో జరిగిపోయినది. ఇప్పుడు గతాన్ని తలుచుకోవద్దు. తప్పు ఎవరిదో వకరిది. మా అమ్మా, మా మామా సమానులయినా పైగా మా

నాన్న పట్టుదల తలమునకలయింది. లేకపోతే రాకపోకలు లేకపోయి వుండవు. అదంతా వుభయులూకూడా మరిచిపోవడం మంచిది. మీకు వచ్చిన ఆపత్తు యిప్పుడే తెలిసింది. వుండలేకపోయాను. నేను లేనప్పుడు యేది యెలా జరిగిందో - దానికి మనం ఇప్పుడేమీ చెయ్యలేము. ఇక ముందు జరగవలసినదంతా నా చేతిమీద జరిగిస్తాను. నువ్వు అడ్డుచెప్పవద్దు" అని యాతడు చెప్పగా ఆతని అభిమానమున కామె తన కృతజ్ఞతను తెలిపెను. "మీ నాన్న చచ్చిపోయినప్పుడు మీమామ చాలా విచారించారు; గాని యేం చెయ్యవచ్చునూ. "నాకంఠంలో ప్రాణం వుండగా వాణ్ణి నా గుమ్మంలోకి రానీయను" అని మీనాన్న పట్టుపెట్టుకోవడంచేత మీమామ రాలేకపోయారు. తరవాతనైనా మీ అమ్మ దూరపుచూపు చూసింది గాని సరిగ్గా మాట్లాడలేదు. ఇప్పుడు నువ్వు యిలా రావడం తెలిస్తే ఆవిడ యేం చేస్తుందో? అసలే మీ అమ్మకు నీమీద కొంచెం కోపం అని తెలిసింది. మీ అన్నయ్యలూ, మీతమ్ముడూ అంటే ఆవిడకి చాలా ప్రీతి అయివున్నప్పుడు నువ్వు మా యింటికి వచ్చి మాకు ఆధారం అయితే నిన్ను అసలే చూడదేమో: మాకోసం నువ్వు మీ వాళ్ళకెందుకు దూరం కావాలి? మేము ఎలాగా ఆపత్తులో కూలే వున్నాము. నువ్వు గూడా కష్టాలు ఎందుకు తెచ్చుకుంటావూ?" అని యామె అడుగగా పేరుభట్టు "అదంతా నాకు తెలవదు. నాజాగర్త నేను పడుతున్నానని మా అమ్మకి కోపం. తెచ్చినదంతా తనకి యిమ్మంటుంది. మా పెద్దన్నయ్య పెట్టిలో సొమ్మే గోకుతాడు. చిన్నన్నయ్య రూపాయ యిచ్చి రెండురూపాయలు పుచ్చుకుంటాడు. తమ్ముడు సంపాదన సిగరెట్లకే చాలదు. పెద్దవాళ్ళు ఇద్దరూ వొడ్డెక్కేరు. నాకు పెళ్ళి కావాలి. మానాన్న బతికి వుంటే నాకు ఇంత బెంగలేకపోవును. ఇంటిదగ్గిర రుణం పెరుగుతోంది. పిల్ల దొరకడమే కష్టం; దొరికితే ఖర్చులికి మళ్ళీ రుణం చెయ్యాలి. కుటుంబపు ఆస్తినీ, రుణాన్నీ గూడా నేను వదులుకోదలుచుకున్నాను. ఏదో నాలుగేళ్ళు కష్టపడితే పెళ్ళి ఆడవచ్చు. వో యకరం భూమీ సంపాదించుకోవచ్చు. వాళ్ళతో విరోధం వస్తే నాకేమీ విచారం కలగదు. ఇదివరకే మా అమ్మకి నామీద కోపం వుంది. మా పెద్దన్నయ్య తన జోలే తనకి గాని యితరులని చూడడు. మా చిన్నన్నయ్యకీ మా అమ్మతోపాటే నామీద ఆగ్రహం. ఇక మాతమ్ముడు - వాడివొళ్ళు వాడికి తెలియడంలేదు. "పెళ్ళి అయీవుపాయం చూసుకో"అని మా అప్పా బావా కూకలేశారు. ఏదో రవ్వంత చేర్చేను. మీదటికి ప్రయత్నం చేస్తాను. కనక మా వాళ్ళు నన్ను చేరనివ్వరని భయం లేదు. మా మామయ్యకి అపరక్రియలు చెయ్యకుండా వుండడం - నేను వుండలేను. తనువులు అట్టే వుండవు. నన్ను మరోలాగ అనుకోవద్దు. నన్ను మీ తమ్ముల్లో వకడనుకో. కర్మ నేనే చేస్తాను" అని స్పష్టముగా చెప్పెను. కాంతమ్మ మతియొక మాఱు దు:ఖించి ఆతని యవలంబనము నంగీకరించెను.

యుక్తసమయమున పేరుభట్టు మేనమామకు అపరకర్మ ప్రారంభించిచేసెను. అందులకు అయిన ఖర్చులు ఆతడే భరింపబోయెను; గాని

కాంతమ్మ అంగీకరింపక అంతయు ఇచ్చివేసెను. వైశ్యులు అనేకులు చాలా సాహాయ్యము చేసిరి. "మీరు ఈ వూళ్ళో యెలాగా వుంటున్నారు గదా? వారి యింట్లోనే వుండి సాయం చేస్తూ వుండండి" అని వారు అతనికి చెప్పిరి.

ఒక మాసము గడచిన తరువాత ఆతడు మేనత్త యింటనే విడిసెను.

## ③

"మాతోపాటు యింత చారూ అన్నమూ తింటూ వుండరాదూ? నీకు సందేహమెందుకోయీ? రాకపోకలు వచ్చేక - నువ్వు మా యింటోనే వున్నాక నువ్వు భోజనానికి తడుముకుంటూనే వుంటే యికనేమి సుఖమూ?" అని కాంతమ్మ అతనిని వారములు చేసికొనవద్దని చెప్పెను; గాని యాతడు వినలేదు. "నువ్వన్న మాటలో తప్పులేదు; గాని మామయ్య పోయాక యిక రాబడి యెక్కడిదీ? అంచేత వున్నదాన్నే సరిపెట్టుకోవాలి. ఉన్నప్పుడు కిందామీదా యెగజిమ్ముకుంటే అయిపోయినాక యేం చెయ్యగలం? కనక నన్ను వారాలు చేసుకోవద్దనకు. నాకు వారాలు యిచ్చినవారంతా ప్లీడర్లూ పెద్దవుద్యోగస్థులూను. వారందరికీ నామీద చాలా ప్రేమ. నేను యెప్పుడు హరికథలు చెబుతానో అని వారెదురు చూస్తున్నారు. ఈ రూపకంగా యిప్పటినుంచి వారితో దృఢపరిచయానికి కారణాలు వుంటే పోనిచ్చుకోగూడదు. నేను దేవురించనక్కర్లేకుండా - వారు ఆప్యాయంగా రమ్మని పిలిచేటప్పుడు రాను అంటే అంతకంటే తప్పులేదు. సిద్ధాన్నాన్ని కాళ్ళజిమ్ముకొనిపోగూడదు" అని యాతడు బదులు చెప్పెను.

పేరుభట్టునకు ఇంతవఱకు "సత్రాభోజనం మఠానిద్ర"గాను ఉండెడిది; గాని మేనత్తయింట ప్రవేశించిన తరువాత నాతనికే లోపమును లేకుండ బోయెను. ఆతడు యింటివద్ద నున్నంతసేపును బంగారమ్మ ఆతనిని పెనవేసికొని తిరుగసాగెను. బావ అనిన ఆమెకు నిద్రాహారములక్కరలేదు. బావ స్నానము చేసిన బట్టలామె యారవేయును. ఆమెయే మడతలందించును. ప్రక్క సవరించును. తలదువ్వును. ఉదయము లేచునప్పటికి దంతధావనమునకు నీళ్ళు, పుడక ఇచ్చును. కావలసినప్పుడు మంచినీళ్ళు తానే తెచ్చి యిచ్చును. ఆతనికి సకలమునామెయే నిర్వర్తించును.

పేరుభట్టు ప్రేమగూడ పరిమితి చెప్పజాలినది గాదు. పాఠము ముగియుటయే తడవుగ - వీథిలోని పని ముగియుటయే తడవుగ ఆతడింటికి వచ్చి యామెను చూడకుండ నొక్క క్షణమైన నుండజాలకుండెను. ఆతడు ఆమెకు సంగీతము ప్రారంభించెను. పరికిణీలు, చొక్కాలు నాతడే కుట్టించి ఇచ్చును. అపుడపుడు ఫలహారము తెచ్చి యిచ్చును. పూవులు, పూలదండలు, తలనూనెలు, సెంట్లు - ఇట్లు ఆతడు మేనమామకూతురును కన్నులలో బెట్టుకొనియుండెను.

వారివురు నొకరు భుజింపకున్న నొకరు భుజింపరు. ఒకరు నిద్రింపకున్న రెండవవారికి నిద్రరాదు. "బావ, బావ" అని మాటిమాటికిని పిలుచుచుండుట కామె విసుపెఱుగదు. "మఱదలా!, మామయ్య కూతురా!, బావమరిదీ, బంగారమ్మా!" అని పిలుచుట కాతడు విసువడు.

కాంతమ్మ వారి స్నేహమును గుర్తించి చాల ఆనందింపజొచ్చెను. మేనల్లుని గుణములను జూచి యామె కాగలవాడని భావించి తన కొమార్త యొక్క భవిష్యత్తును గుఱించి యోచనలు ప్రారంభించెను. ఒకనాడు ఆమె ఆయాలోచనమున మునిగియుండగా వసారాలో ఛలోక్తులతో సంతోషముగ కాలము గడుపుచు ఆయువయువతులు - ఆ ప్రేమప్రపూర్ణులు ఆనందపరవశులై యుండిరి. ఎన్నో ప్రస్తావములు తిరిగిపోవుచుండెను. తుదకు పేరుభట్టు వివాహప్రస్తావము వచ్చెను. "నాపెళ్ళిలో నువ్వేం చేస్తావు చెప్పు మరదలా" యని యాతడడిగెను. "నేనా? - నేనా? - మఱి - మఱి - నేనా?" యని యేమి చెప్పవలయునో యెఱుంగక యామె తడవుకొనుచుండగా లోపలనుండి కాంతమ్మ "నీయెడం వేపున పీటమీద కూచుంటుంది" అనియెను.

ఇద్దఱు నులికిపడిరి. మఱల వారికి మాటరాలేదు. చూపులు రెండు నేక మయినవి. మందహాసము పొంగిపోయినది. ఉన్నట్లుండి యామె ఒక్క అంగలో ఇవ్వలకు వచ్చిపడియెను.

## 4

అయాచితమగు నేకాంతమున పేరుభట్టు సుఖమయ కల్పనములలో మునిగి తేలుచుండగా కాంతమ్మ యెదుట ప్రత్యక్షమయ్యెను. "నాయనా, బీదవాళ్ళకి - అందులోనూ దిక్కులేని వాళ్ళకి యిలాంటి కోరికలు వుండగూడదు; గాని నిజంచేత తాహతు లేని పరుగులు మంచివి కావు గాని - అయినా - ఏమిటో యెరగవూ? ఆడాళ్ళకి ఇలా తోస్తూ వుంటుంది. మీ మామ వుంటే ఎలా జరుగునో చెప్పలేను. మా బంగారమ్మ ముందు సుఖమే పొందుతుందో కష్టమే అనుభవిస్తుందో చెప్పలేను; గాని చిన్నతనంలోనే దానికి తండ్రి వల్ల సుఖపడే యోగం తప్పిపోయింది. అల్లుణ్ణి యిల్లరికం వుంచుకోవాలని వారి తలంపు. ఈశ్వరుడు నీకిలాంటి బుద్ధి యెందుకు పుట్టించేడో తెలవకపోయినా మనబుద్ధి కల్పనలు చేస్తూ వుంటుంది కాదూ? నువ్వు మా యింటో ప్రవేశించి మాకు అన్నివిధాలా సాయం కావడం గొప్పలోది కాదు. అంటే నీవుపకారాన్ని తీసెయ్యడం కాదు సుమా! ఎలాంటి అనుగ్రహంతో నువ్వు మమ్మల్ని కాపాడ్డానికి పూనుకున్నావో అలాంటి అనుగ్రహం తోటే - ఏం చెప్పడానికీ సాహసం కలగదు మావంటి వాళ్ళకి. నీకంటే మాకు దిక్కు లేదు గనక - ఆపత్సముద్రంలో పడి కొట్టుకొని పోయేటప్పుడు నువ్వే చేయూత యిచ్చేవు గనక - చాచిన చేతిని ముదుచుకోక అందం లేకపోయినా -

తెలివితేటలు తక్కువయినా - మేనమామ కూతురని అభిమానించి నా చిట్టితల్లిని-"
ఇట్లు చెప్పి యామె దు:ఖోద్రేకమువలన మాట్లాడజాలకపోయెను.

పేరుభట్టు హృదయము కరగిపోయెను. కూర్చున్నవాడు లేచి నిలిచి యిట్లనెను.

"అత్తా, ఇప్పుడేం వచ్చిందనీ యీ దు:ఖం? బంగారమ్మకు పెళ్ళీ యీడు వస్తోందనీ, వివాహమయిందాకా నీకు విచారంగా వుంటుంది గనక ఆ విచారానికి అవకాశం లేకుండా తగిన వరుణ్ణి వెదకి త్వరగా పెళ్ళి చేసెయ్యాలనీ - అంటే నీ తమ్ములూ నీ అన్నలూ పూనుకోకపోతే సుమా వారు పూనుకొని వారే సర్వస్వమూ నిర్వహిస్తారు. అందుకు సందేహం లేదు. అయినా యీ శుభకార్యం అయిందాకా నాకు నిద్రపట్టదు. నిజంగా, నీ దగ్గిర బంగారబ్బొమ్మలాంటి ఆడపిల్ల వుండడమూ, నాకు వివాహం కావలసివుండడమూ, దైవం అనుగ్రహిస్తే నీ కూతుర్ని పెళ్ళిచేసికోవడానికి నేను అర్హుణ్ణయి వుండడమూ, పైగా నువ్వు నిరాధారురాలవై యుండడమూ - ఇలాంటి వన్నీ వుండడం చేత నీ కూతుర్ని పెళ్ళాడాలనే వుద్దేశంతోటే నేనిక్కడ ప్రవేశించానని నువ్వెక్కడ భావించిపోతావో అని నేననేకవిధాల భయపడుతున్నాను. బంగారమ్మని జమీందార్లు కూడా కోరి చేసుకుంటారు. హృదయం గలవాడెవడూ - కేవలమూ గార్హస్థ్య ధర్మమునే ప్రధానముగా చూచుకొనేవాడెవడూ, సుఖమే ముఖ్యమైనవాడెవడూ, నీకూతుర్ని తిరస్కరించలేడు. ఇక పీసపాటివారి మర్యాద గుఱించీ, ఔదార్యాన్ని గుఱించీ, పవిత్రతను గుఱించి యెవరికీ యెప్పుడూ ఆలోచనలు కలగవలసిన అవసరాలే లేవు. నిజం చెప్పవలసినపుడు విద్యా, ప్రయోజకత్వమూ లేకపోయినా ఆస్తి అంతకుముందే లేకపోయినా మేనల్లుణ్ణి గనక అత్తా, నీ కూతుర్ని నాకియ్యవలసిందని నేనడగడం తప్పుగాదు; గాని అలాంటి పిల్ల నాకు ఎన్ని వేల సంవత్సరాలు తపస్సు చేస్తే దొరుకుతుందీ? స్నేహమూ, ప్రేమా, అనురాగమూ, భక్తీ, త్యాగమూ, ఓర్పూ, శాంతమూ, ఇలాంటి సుగుణాలన్నీ నీ కూతురువద్ద వికసించి పరిమళిస్తూ వున్నవి. దూరాలోచన, మనస్సుని లొంగదీసుకోడానికి ప్రయత్నించడమ్మూ, ఉన్నదానితో తృప్తిపడడము, వయోధర్మము ననుసరించీ, జతని చూచీ భేషజముల చెంతకి పోకపోవడమూ, మంకుపట్టు పట్టకపోవడము - ఇలాంటివాటిని చూచి నిజంగా నేను బంగారమ్మని గుఱించి గుటకలు మింగుతూనే వున్నాను. అయితే చల్లకివచ్చి బఱ్ఱెను బేరమాడే దన్నట్లు నీ యింట్లో తలదాచుకోడానికి వచ్చి అలాంటి సంకల్పాన్ని చేయడం చాలా తప్పు అని నేను ఆయాశని విడిచి పెట్టుకోవడానికి చాలా ప్రయత్నం చేస్తూ వున్నాను. నువ్విప్పుడు నామీద చూపిన అనుగ్రహం దేవతలకుగూడా దుర్లభమై వుంది. నేనున్న స్థితిలో పెళ్ళికావడమే అమ్మక్క. అందులో నిక్కమైన నీలంవంటి బంగారమ్మని నీవై నాకు ఇవ్వజూడడం కంటె ఆశ్చర్యకారణం యేంవుందీ? బంగారమ్మని ఎలాంటివాడూగూడా కళ్ళతో అద్దుకుని - నెత్తిమీద పెట్టుకుంటాడు. ఒకమూల నేను దురదృష్టవంతుణ్ణి అయిపోయానుగదా అని

విచారించడంతోటీ, నీకూతుర్ని పెళ్ళాడడానికి ఎవడు పెట్టిపుట్టేడు అని వాడి అదృష్టాన్ని మెచ్చుకోవడంతోటీ - నాకు ప్రపంచం తెలియడం లేదు. అందులోనూ నెల్లాళ్ళ నుంచి యెక్కడ చూచినా పెళ్ళిల్లే. ఎక్కడ చూచినా వుత్సవాలే - మాఘమాసం ప్రవేశించింది మొదలుకొని నేను పడే బాధ సర్వేశ్వరుడికే తెలుసును. ఇలాంటి సమయంలో నామీద నీకు ఇలాంటి అనుగ్రహం కలగడం - ఇది నాకు పార్వతీదేవి సాక్షాత్కరించి కోరినవరం యిచ్చినట్లు వుంది. ఏ జమీందారేనా పిల్లని ఇస్తానని వస్తే ఆ సంబంధాన్ని నిరాకరించి నీ కూతుర్నే చేసుకోవాలని తోస్తుంది; గాని ఎవడికీ బంగారమ్మ మీద ఆశ పుట్టకపోదు. ఇన్నాళ్ళ నుంచి ప్రేమించిన నా బంగారాన్ని నాకిస్తాననడం చేత నాకు బ్రహ్మానందం కలుగుతూ వుంది. మాటలు రావడం లేదు. నువ్వు చూపిన అనుగ్రహానికి జన్మజన్మాలయందూ నీ పాదాలు పూజిస్తూ వుంటాను."

ఇట్లు చెప్పి యాతడు కాంతమ్మ పాదములంటెను. అందులకు ఆమె సంశయించుచు వెనుకకు తగ్గి లోపలకు వెళ్ళి సిగ్గుపడుచున్న బంగారమ్మని చేయి పట్టుకొని తీసికొని వచ్చి "నాయనా! నీ తెలివితేటలూ, నీ ప్రయోజకత్వమూ చూచి యెలాంటి వాళ్ళయినా వెయ్యిన్నూటపదార్లు కట్నం యిచ్చి పిల్లనిస్తారు. ఆడపిల్ల పుట్టిన తరువాత ఒకయ్యకి యివ్వవలసిందే గదా? నీవంటి పెళ్ళికొడుకు దొరకడం నా అదృష్టం. ఇదివరకీ బంగారమ్మ అదృష్టం యెలాంటిదో అని సందేహంగా వుండేది. నెల్లాళ్ళయింది మీయిద్దరికీ వున్న ప్రేమని చూచీ, నువ్వు నన్ను రక్షించడం చూచీ, మీ యిద్దరికీ బ్రహ్మ దాంపత్యాన్ని విధించివుంటాడని నిశ్చయించి బంగారమ్మని నీకివ్వాలనుకున్నాను. చెప్పడానికి సందేహంగా వుంది. నిజంగా అనుగ్రహం వుండడం చేతగాని లేకపోతే నువ్వు అంగీకరించడానికి మా పిల్ల యెంతటిది నాయనా? నాశక్తీ, నాతాహతూ నువ్వెరగనివి గావు. పైగా మగదిక్కు లేకపోవడమూ అల్లుడికి అచ్చట్లూ, ముచ్చట్లూ తీరడానికి అవకాశం లేకపోవడము, ఇలాంటివన్నీ తలచీ భయపడుతూనే కోరినందుకు దీనురాలనని నామాట తీసెయ్యకుండా నా చిట్టితల్లిని పెళ్ళాడ్డానికి అంగీకరించేవు. ఇంతకంటె నువ్వు నాకు చేయదగిన - చేయగలిగిన వుపకారం యేమీ లేదు. కట్నాలివ్వలేను. కానుకలివ్వలేను. ముద్దుమురిపాలు తీర్చలేను. పండుగనాడు పప్పూ అన్నం అయినా సరిగ్గా పెట్టలేను. నా పిల్లని నీకిస్తున్నాను" అని బంగారమ్మ చేతిని ఆతని చేతి కందించెను. పేరుభట్టు బ్రహ్మానందంతో నామె చేతిని పట్టుకొనియెను; గాని సాధ్యస్కమగు లజ్జాతిరేకము వలన నామె తల్లివద్దకు వెళ్ళిపోయెను.

అంతట కాంతమ్మ కొమార్తెను చేరదీసికొని "బావదగ్గిర కూచో అమ్మా, పూర్వజన్మంలో యేం పాపం చేశావో తండ్రిలేనిదానవైపోయావు. నేను అనాథని. నిన్ను బతికించుకోవడమే నాకు బ్రహ్మాండంగా వుంది. బావ వంటివాడు లేడు. ఇంతకంటే నేను ఏమీ చెయ్యలేను" అని కంటదడి పెట్టుకొనియెను. పేరుభట్టు ఆమెను ఊరడించి బంగారమ్మను బలవంతముగ తనవద్దకు దీసికొనియెను.

"వెళ్ళమ్మా పెంకితనం చెయ్యకు" అని చెప్పుచు కాంతమ్మ పని చేసికొనుటకు వెడలిపోయెను.

## ⑤

"ఇదేమిటే బంగారమ్మా? మామకూతురువుగా మాత్రమే వున్నప్పుడు బావాబావా అని యేమీ తోచనిచ్చేదానవు కాదు. పెళ్ళి అయేక యేం వొరగదోస్తావో కాని యిప్పుడు మాట్లాడ్డమే - కంటితో చూడ్డమే మానేశావేమే? అయ్యో; పుణ్యమా? మీ అమ్మ యిస్తానంటే పెళ్ళాడతానన్నాను; గాని నిన్నేం చేశానే నేనూ? పేరుగాకుండా పలుకు గూడా బంగారమైపోయిందా యేమిటి? ఇలా చూడూ - మొగం పైకెత్తితే కళ్ళు మూసుకుంటుందేమిటో? కళ్ళమీద వూత్తే యేంచేస్తావూ? చక్కలిగిల్లిపెడితే యేం చేస్తావూ! అమ్మోయి చూడవే అంటే మీ అమ్మ వచ్చి యేం చేస్తుందేమిటి యింక? బుద్ధిపూర్వకంగా మీ యమ్మే యిచ్చేసింది నాకు నిన్ను! ఇంతకు మునుపు నేను జంకుతూ వుండేవాణ్ణి కాని యింక అలా జరగదు. మా చెల్లెలితో చెప్పేనంటే సరీ అది పెళ్ళి అయి అత్తారింటి కెళ్ళీ దాకా పెద్దాడబడుచయి నిన్ను ముక్కు నేలబెట్టి రాశేస్తుంది: కనక ఇలా చూడు. వోమాటు చూడు. వినపడుతోందా? ఇక వట్టొట్టి మాటలు పనికి రావు కామోసు నీకు. ఆపెట్టి యిలా తీసుకురా రూపాయలు యిస్తాను" అని యాతడనేక విధముల బుజ్జగించెను; గాని యామె పలుకలేదు. చూడలేదు. క్షణక్షణము అవ్వలకు బోవుటకు చేయు ప్రయత్నముగూడ మానలేదు.

"వుండు నీ పని యిలా గాదు" అని చెప్పి యాతడు లేచి యామె నెత్తుకొని తన చిన్న ట్రంకు పెట్టె యొకచేత బట్టుకొని వంటగదిలోనికి బోయి కాంతమ్మ కెదురుగ కూరుచుండి "చూశావా అత్తా! నీ కూతుర్నీ? క్షణంలో యెలా పెంకితనం వచ్చిందో దీనికి. యిలా అయితే కష్టమే. బతిమాలడం నా చేతగాదు యేమనుకున్నావో? చిలకలాగ కులకుతూ, హంసలాగ తక్కుతూ, పావురంలాగ తారతూ, చలాకీగా, వుత్సాహంగా, వుంటేగాని నాకు పనికిరాదు. నీకు చూపెట్టడానికి నాసంపాదన యేమీలేదు; గాని అయినా పెళ్ళన్నాక వూరికే కాదు గనక యివిగో నా దగ్గిర ఆరువందల ముప్ఫయి రూపాయలు వున్నాయి. ఇది స్వార్జితం. పెళ్ళాడాలని బుద్ధిపుట్టేక యేణ్ణర్ధం సంపాదన. పరమరహస్యంగా వుంచుకున్నాను. నోట్లయితే జాగ్రత్త చేసుకోవడం కష్టమనీ, రూపాయ లయితే బలువనీ, రహస్యం దాగదనీ, కాసులకింద మార్చేశాను. ఇవి నలభై కాసులు. నువ్వు యేమీ అనకపోయినా నగలు చేయించకపోతే నీ కూతురు మూతి ముడుచుకుని కూచుంటుంది కనక ఈ కాసులతో యేం చేయించమంటావో చెప్పు. మావయ్య సంవత్సరీకాలు - ఏం చెయ్యను అత్తా? పురాకృతం అనుభవించక తప్పదు. కన్న వొక్క కూతురికీ పెళ్ళిచేసి ఆనందించుకోడానికి లేకపోయింది

మామయ్యకి. నీ జీవితం కూడా అంధకారబంధురం చేశేశాడు ఈశ్వరుడు. అయినా నీకూ నాకూ గూడ దీపం అయిన యీపిల్లని చూసుకుని నువ్వు దు:ఖం దిగమింగుకుంటే గాని వీలులేదు. మళ్ళీ మాఘాదిపంచకంలోనో అంతకీ తొందరయితే శ్రావణమాసములోనో గాని పెళ్ళికి వీల్లేదు. గనక ఈలోపుగా ఇంకా కొంచెం సంపాదించుకొని వస్తాను. దేవుడు మేలు చేస్తే ఖర్చులకి గాక నాలుగైదు కాసులయినా సంపాదించగలనని వుంది. కనక వున్నంతమట్టుకు ముందు ఈ కాసులకి సరిపడ్డ వస్తువులు పురమాయిద్దాం. ఏం పిల్లా? ఏం కావాలి నీకు? నీ యిష్టం వచ్చిన నగలు చేయించమంటావా? నా యిష్టం వచ్చిన నగలు చేయించమంటావా? కాసులు చూపించిన తరవాత గూడా మాట్లాడకపోతే యెలాగా నీతో వేగడం? వొక్కమాటు - నాకేసి కాదులే, ఈ కాసులు చూడూ" అని ప్రోత్సహించెను; గాని బంగారమ్మ పలుకలేదు. కూతురు అదృష్టమును జూచి విచారమును దిగమ్రింగుకొని కాంతమ్మ గూడ "నీకేం గావాలో చెప్పవే చిట్టితల్లీ: సిగ్గుపడకమ్మా? ఇందాకటిదాకా ఎలాంటి బావో ఇప్పుడూ అలాంటి బావే పేరుభట్టు. "పేరూ" అని వోమాటూ, "భట్టూ" అని వోమాటూ, నీ పేరు భట్టూ అని వోమాటూ, మా బావపేరు భట్టు అని వోమాటువు భట్టుపేరుబావా అనివోమాటూ యిలాగా చెవులు పట్టుకుని ఆడించే దానవుకాదుటే తల్లీ యిప్పుడలా సిగ్గుపడతావూ? తిన్నగా కూచో అమ్మా వాళ్ళేను. పెంకిదానవనుకుంటాడు బావలేకపోతేను -" అని చెప్పెను. అందులకు బంగారమ్మ పలుకకపోగా కాంతమ్మ "నేనడిగి కనుక్కుని చెబుతాను లేవోయి! నీయెదట చెప్పడానికి సిగ్గుపడుతోందీ" అనియెను. "అయితే సంతోషమే" అని పేరుభట్టు కాసులు బంగారమ్మ చేతిలోనుంచి, పెట్టె పట్టుకొని వెడలిపోయెను. పిదప బంగారమ్మ "ఈ కాసులు నాదగ్గిర యెందుకూ? దాచరాదూ?" అనగా కాంతమ్మ "అయితే బావచేతికి యిచ్చిరా" అనియెను. ఆమాటమీద బంగారమ్మ ఉబుకుచున్న మందహాసమును మాటుకొనజాలక అందులకు సిగ్గుపడుచు "నువ్వు మరీని. నాకు తెలవదు. నువ్వు దాచుకో" అని వానిని తల్లి దెసకు విసరి వైచి దొడ్డిలోనికి పాఱిపోయెను.

## 6

ఏడు గంటలకే భుజించి పేరుభట్టు వెడలిపోయెను. ఆతడు ఒకచోట హరికథలో ఫిడేలు వాయించుట కంగీకరించి యుండెను. భోజనానంతరము అన్నియు సవరించుకొని కాంతమ్మయు, బంగారమ్మయు ప్రక్కల మీదికి వచ్చునప్పటికి తొమ్మిది గంటలయ్యెను.

మడతమంచ మొకటి అరుబైటను, పట్టెమంచ మొకటి వసారాలోను వేయబడియుండెను. బంగారమ్మ పేరుభట్టు నిమిత్తము ఏర్పఱుపబడిన ఆమడత మంచము మీద పరుండెను.

ఒక్క గడియ వఱకు నెవ్వరు నేమియు మాట్లాడలేదు. ఏవో సాంసారికపుటాలోచనములు మెఱచిపోయిన తరువాత కాంతమ్మ లేచివచ్చి కొమార్తె వద్ద కూరుచుండి పలుకరించెను. కూతురు గాఢనిద్రలో నున్నదానివలె ఒడలు విఱుచుకొనుచు లేచి కూర్చుండెను.

"ఏమంటావు బంగారం?"

"ఏమిటదీ?"

"ఇందాకా బావ అడిగినమాట. నగలు తొరగా పురమాయిస్తే గాని తోచదంటున్నాడు తనకి"

"పురమాయించుకోమనూ. నాతో చెప్పడమెందుకూ నువ్వా?"

"నీతో చెప్పడం లేదు. నిన్ను అడుగుతున్నాను."

"నేనేం చెప్పాలీ?"

"ఏమేం నగలు కావాలీ?"

"కావాలన్నవన్నీ వస్తాయా యేమిటీ?"

"ఉన్నంతలో వస్తాయి. వస్తే మాత్రం మఱేమీ లేకుండా ఇన్ని నగలు దిగేసుకుంటే బాగుంటుందా యేమిటి బీదవాళ్ళకి?"

"బీదవాళ్ళయినప్పుడు తొందరపడి యిప్పుడు నగలు చేయించుకోకపోతే మాత్రం పోయిందేమిటీ?"

"అతను చెప్పిన మాటలు విన్నావా మధ్యాన్నం?"

"నాకు తెలవదు."

"ఇదేమిటే తల్లీ యిలా మాట్లాడతావూ? మునపటిలాగే కల్లిబొల్లి మంటూ వుండమ్మా బావతోటి. లేకపోతే చిన్నపుచ్చుకుంటాడతను."

"అందుకోసం యిప్పుడేమి చేయమంటావే?"

"నగలమాట చెప్పు"

"నాకు తెలవదంటూంటేనూ?"

"బాగానే వుంది. పెంకితనం చెయ్యకమ్మా."

"నీకు నిద్రరాదా యేమిటీ యివాళా?"

"నీకు మాత్రం వస్తోందా యేమిటి నిజంగా? సరిగా చెప్పు తొరగా. లేకపోతే బావ వస్తాడు. అతను వుండగా మాట్లాడుకోవడం బాగుండదమ్మా. చెప్పు"

"నాకేం తెలుసునే చిన్నపిల్లకీ?"

"నువ్వు చెబితే బావ పొంగిపోతాడు."

"ఇష్టం వచ్చినవి చేయించవచ్చు"

"అదే తెలవడం లేదు. ఎవరి యిష్టమే?"

"అబ్బా! నువ్వు మరీని. నాకు తెలవదు పోయి పడుకో"

"ఎంతసేపే యిలాగా?"

"నేనేం చేశానే?"

కాంతమ్మ అనేకవిధముల బుజ్జగించి యడుగగా పండ్రెండుగంటలవేళ బంగారమ్మ సరియైన జవాబు చెప్పెను. కంటె, పుదుచ్చేరినాను, వడ్డాణము, చేతులకు తోడాలు, కట్టకాసులపేరు కావలెనని బంగారమ్మ చెప్పెను. "నలభై కాసులే వున్నాయిట దగ్గిర. ఈ వస్తువులన్నీ రావు వాటికి. కాసులపేరు కాపరానికి వెళ్ళేటప్పటికి చేయించుకుందువు గానిలే" అని తల్లి చెప్పగా కొంచెము వాదప్రతివాదములు జరిగిన తరువాత బంగారమ్మ అందులకంగీకరించెను.

పేరుభట్టు రెండుగంటలవేళ యింటికి వచ్చెను. అప్పటికింకను తల్లియు కూతురును మాట్లాడుకొనుచునే యుండిరి. పేరుభట్టు కేకవిని తలుపు తెఱచుటకు కాంతమ్మ లేచుటయు, బంగారమ్మ తమ ప్రక్క మీదికి వచ్చి పడుకొని కన్నులు మూసికొనుటయు నొక్కమాతే యయ్యెను.

పేరుభట్టు లోపలకు వచ్చి కాళ్ళు కడుగుకొని దాహము పుచ్చుకొని తన నిమిత్తము వేయబడియున్న ప్రక్క మీద కూర్చుండునప్పటికి కాంతమ్మ నగల ప్రస్తావము తెచ్చెను. అంతయు విని ఆతడు ఉన్న కష్టసుఖములు చెప్పి ప్రకృతపు అవసరానవసరములను బాగుగ వివరించి బంగారమ్మ కోరిక నానందముతో అంగీకరించి ప్రఫుల్ల చిత్తుడై సుఖనిద్రలో బడియెను.

## 7

పేరుభట్టు మఱునాడే నగలను పురమాయించెను. విద్యాభ్యాసమున ద్రవ్యార్జనమున, ప్రజ్ఞాప్రదర్శనమున - సకలమునందును ఆతని యుత్సాహము ద్విగుణముగా ప్రస్ఫుట మగుచుండెను. బంగారమ్మ భావసరణి గూడ చాల మాఱెను. తన తండ్రికి తానేక సంతానము. భూవసతివలని యాదాయము కాలము గడుపును. ఇక్కడి నుండి యక్కడకు, అక్కడనుండి యిక్కడకు బంతివలె అద్దెకొంపలలో తిరుగవలసిన పనిలేదు. కొంతభాగ మద్దెకిచ్చుకొనుటకు లేకపోయినను ఆయిల్లు తాము తలదాచుకొనుటకు జాలును. ఈ కల్పనమంతయునైన తరువాత "బావచాలా మంచివాడుకూడానూ" అను వాక్యము తెలియకుండ దోచి యామెను లజ్జాపరవశను గావించెను.

పండ్రెండేళ్ళ యాడుపిల్ల. అంత చిన్నవయసున గూడ స్త్రీలకు ఇట్టి యాలోచనములు తోచుటయు, అప్పటినుండియు సాంసారికములయందు వయసు వచ్చిన పురుషుల కంటె గూడ ఎక్కువ వివేకము జూపుటయు, భారతసంఘమున అనుశ్రుతముగా వచ్చుచున్న గొప్ప సాంప్రదాయము. పాశ్చాత్యులు ముక్కుమీద వ్రేలుపెట్టుకొనునంతటి చిన్నవయసున కాపురమునకు వచ్చినను, తుదకు సంసారభార మంతయు మీదపడినను, పురుషుడు వెనుకముందులు

తెలియనివాడయినను హిందూ స్త్రీలు వ్రేలుపెట్టి చూపించుకొనకుండునట్లు గృహనిర్వహణము గావించుట యీ సాంప్రదాయమునకు గొప్ప చిహ్నమే. గ్రహింపగలవారికి గతరాత్రి జరిగిన సంభాషణమునందలి బంగారమ్మ మాటలలో "వున్నదంతా పెట్టి యిప్పుడు నగలు చేయించుకోకపోతే యేమి వచ్చింది?" అను భావము స్పష్టముగనే ధ్వనించుచున్నది. కాంతమ్మ దీనిని గ్రహింపకపోలేదు. అల్లుని యుత్సాహమునకు - సంపాదనమున నాతితేరియే యున్న పడుచుదనమునందలి ఆతని సుఖాశకు విఘాతము గలిగింపజాలక ఆమె కొమార్త నన్నివిధముల బలవంతము చేసి మెప్పించెను.

పేరుభట్టు బంగారమ్మ సహధర్మిణీత్వమునకు కంటె కాంతమ్మ యాజమాన్యమునకు చాల నాశపడియెను. ఆమె కాపురమునకు రాకపూర్వము మామగారు ఉన్నదంతయు "సప్రతిగ్రహీతలము" అను గర్వముతో కూర్చుండి తినివేసెను. కాంతమ్మ వచ్చునప్పటి ఏదినమున కాదినము బియ్యము కొనుక్కొను స్థితి నిరంకుశముగ నుండెను. అప్పటికింకను వేంకటశాస్త్రి చదువు మానలేదు.

కాంతమ్మ ఆరుమాసము లిట్టి అయోమయ సంసారమున కాపురము చేసెను. ఈ స్వల్పకాలమునందే యామె అత్తగారి సాధింపులకును, మామగారి విసుగుదలకును, ఇల్లుపట్టిన ఆడపడుచు మూతివిఱుపులకును గుఱియయ్యెను. ఆత్మసంయమనము గల ఆమె వీని నన్నిటిని జవాబు చెప్పకయే సహించెను; గాని ఒకనాటి రాత్రి భర్త యాదృచ్ఛికముగా పలికిన మాటను పురియెక్కించి భర్తను రాజమహేంద్రవరమునకు తీసికొని వచ్చెను. తండ్రి తగులబడిపోగా మిగిలినదానిని రెండవకుమారుని దుర్బోధవలన పంచిపెట్టననగా వేంకటశాస్త్రి దానికి నీళ్ళువిడుచుకొని వచ్చెను.

అన్నలిద్దఱును గుంటపూవులు పూయుచునే యుండగా వేంకటశాస్త్రి సంసార మిట్టు చిగుర్చుటకు వేంకటశాస్త్రి తెలివితేటలకంటె కాంతమ్మ సామర్థ్యము ముఖ్యకారణమని యాతడు నిశ్చయించుకొనియెను. అట్టి కాంతమ్మ తనకు అత్తగారగుట తన యదృష్టమని యాతడు నిశ్చయించుకొనియెను.

## ⑧

నగలు తయారైనవి. వివాహమునకు పెట్టుకొనిన గడువు సమీపించినది. పేరుభట్టు యింటికి వెళ్ళి ఈ సంగతి చెప్పగా తల్లి చఱ్ఱుమనియెను. పెద్దన్న "నీయిష్టం" అనియెను; గాని చిన్నన్న మాత్రము "నువ్వు స్వతంత్రిస్తావా? వాళ్ళపిల్లని చేసుకోడానికి వల్లగాదు" అని ఖచ్చితముగా చెప్పి తల్లికి దుర్బోధగావించి "మేం చెప్పినట్లు వినకపోతే నీకూ మాకూ సంబంధం లే"దని యామె చేత ననిపించెను. అది విని పేరుభట్టు "అంతేచాలు" అని ఊర్ధ్వశ్వాసముతో వెడలిపోయెను.

ప్రయత్నములన్నియు ముగిసెను. పేరుభట్టు పినతల్లికొడుకు లిరువురును, మేనత్తకొడుకొకడును వచ్చి చాల సాహాయ్యము గావించిరి. కాంతమ్మ తన తమ్ములను పెళ్ళికి మట్టుకే పిలిచెను. అగుటచే వారు సరిగ లగ్నమునాటి రాత్రికి వచ్చెదమని చెప్పిరి. పేరుభట్టు పెద్దన్న భార్యతో గూడ వచ్చెను.

ముహూర్తము సమీపించినది. పేరుభట్టు పినతల్లి పేరుభట్టును పెండ్లికుమారుని, బంగారమ్మను పెండ్లికూతురును గావించెను. అంత ముఖ్యులు గాని బంధువుల స్త్రీలు మఱికొందఱు గూడ వచ్చి పేరుభట్టు తల్లి మున్నగు వారు రానందులకు కారణములను కదుపజూచిరి; గాని "ఆమాట అడగవద్దు" అని యాతడు ఖచ్చితముగా చెప్పి కొనలు సాగవలసిన యాప్రస్తావమును త్రుంచివేసెను.

రాత్రి వివాహమనగా చేయవలసిన ప్రయత్నములన్నియు ముగియుటయు, రావలసిన వారు అందఱును వచ్చుటయు జూచి "పెద్దన్నయ్యా, ఈ స్థితిలో అమ్మ రాకపోయినా తక్కినవాళ్ళు రాకపోయినా నాకు బెంగలేదు. నువ్వు వచ్చేవు. అంతే చాలు. నాన్న తరవాత నువ్వే నాకు ప్రధానం. నువ్వూ వదినా స్నాతకపు పీటలమీద కూచుని యీకార్యం గట్టెక్కించాలి" అని పేరుభట్టు చెప్పగా ఆతడు వల్లెయనెను.

స్నాతకమైనది. ఉభయపక్షముల వారికిని, ఆగంతకులకును గూడ కాంతమ్మ యింటనే భోజనములకు ఏర్పాట్లు జరిగెను. భోజనానంతరము జాము ప్రొద్దువేళ పేరుభట్టు ఒక ప్లీడరు అట్టి సమయమున ఇచ్చెదనన్న సాహాయ్యము నందుకొనుటకు ఇన్నీసుపేటకు బయలువెడలెను. వెంట నాతని మేనత్త కుమారుడుండెను.

మార్గమధ్యమున పరిచితులు, మిత్రులు, ఆశ్రయులు, సహాధ్యాయులు అనేకులు కాన్పించిరి. అందఱును తెల్లవారుజామున వివాహమనియు, అయిదు దినములును రావలెననియు నాతడు పిలుచుచు ముందునకు బోయెను.

పాలుచౌకు సమీపించినది. వారిరువురును సరిగ తూము మీదికి వచ్చిరి. పడమటి నుండి బస్తాలతో మోటుబళ్ళు వచ్చెను. దక్షిణము నుండి జట్కా బళ్ళు వచ్చెను. తూర్పునుండి సీమ వెండి గిన్నెల బళ్ళు వచ్చెను. ఉత్తరము నుండి మోటారొకటి వచ్చెను.

అన్నియు నక్కడ తారసిల్లెను. ఏవియు వెనుకకు తగ్గలేదు. బళ్ళవాళ్ళొక్కరొక్కరే దిగి దారి చేసుకొనబోవుచుండగా త్రాగియున్న డ్రైవరు మోటారును రయిని విడిచెను. చూచుచుండగా నది పందికొక్కువలె గోండ్రించుచు దారితోచక కళవళ పడుచున్న పేరుభట్టును పడగొట్టి, ఆతని మీదుగా జట్కాలను రాసికొనుచు బోయెను.

మేనత్తకొడుకు భయభ్రాంతుడై చూడగా పేరుభట్టు రక్తములో దేలుచు పడిపోయియుండెను. కుడికాలి పాదము విరిగిపోయెను. ఎదమకాలు మడత పడిపోయెను. రెండుతొడలును పిప్పిపిప్పి అయిపోయెను.

అందఱును మూగిరి. ప్రక్కనేయున్న కిల్లీల దుకాణదారు ఒక సోడా సీసాను తెచ్చి త్రాగింపగా పేరుభట్టు కష్టము మీద తాగెను. అందఱును తెల్లవోయి ఒక్కక్షణమయిన తరువాత ఆతనిని బండియెక్కించిరి.

"వొక ప్లీడరుగారు యీవేళ యాభైరూపాయలు యిస్తామన్నారుట. ఈపాటికి వస్తూవుంటాడు" అని కాంతమ్మ తన రెండవ యాడుబిడ్డతో చెప్పుచుండగా బండివచ్చి వీధిలో నిలిచెను. మేనత్తకొడుకు బండి దిగుటయే తడవుగ జరిగిన యాపత్తు ఇంటనందఱకు దెలిసెను.

దు:ఖము పొంగిపోయినది. ఇరుగుపొరుగు వారు కొందఱువచ్చి తొందరపెట్టగా అందఱును ఆసుపత్రికి బయలుదేరిరి.

సహోద్యోగి సాహాయ్యముతో దొర పరీక్ష గావించి పెదవి విఱిచెను. సహోద్యోగి ఆ పెదవివిఱుపునకు వ్యాఖ్యానము చేసెను. అందఱును గొల్లుమనిరి. కాంతమ్మ మొదలు నరికిన చెట్టుపగిది పేరుభట్టువద్ద కూలబడియెను. "బావాబావా" యని రోదనము చేయుచు బంగారమ్మ గూడ కూలబడెను.

ఒక్క క్షణము దు:ఖవేగము నెవ్వరు నాపజాలకపోయిరి. పేరుభట్టు చేయు సంజ్ఞలను జూచి అందఱును దు:ఖము బిగపట్టుకొనిరి. "ఏమిటి బావా" అని సిగ్గును ఎక్కడకో పోద్రోలి బంగారమ్మ యడుగగా పేరుభట్టు ఆమె రెండుచేతులును బట్టుకొని యిట్లు చెప్పెను.

"ఏడవకు ఏం ప్రయోజనమూ? ఈశ్వరసంకల్పం యిలావుంది. నా పూర్వపాపం బద్దలైంది. లేకపోతే అన్నీ సిద్ధమైనాక యిలా జరగదు. నిన్ను పెళ్ళాడి సుఖపడ్దామనుకున్నాను, యోగం లేదు. అదృష్టం లేదు. పెట్టిపుట్టలేదు. మనయిద్దరికీ మానసికంగా దాంపత్యం సిద్ధించినా శాస్త్రప్రకారంగా సిద్ధింపలేదు. కనక ఈ సమయంలో నీకు నేను చెప్పవలసింది అంతగా లేదు. ఈ బావని మరిచిపో. అత్తా; నా మనస్సులో వున్న భావాలని చెప్పలేను. ఏమని చెప్పనూ? ఏంప్రయోజనమూ? ఎప్పుడో చేసుకున్నది యీవేళ అనుభవానికి వచ్చింది. తెల్లవారగట్ల పెళ్ళి అనగా సాయంత్రం చావు. భరించలేను; కాని యేం చెయ్యనూ? పేరుభట్టు లేనే లేడనుకో. పుట్టనేలేదనుకో మరిచిపో. చెప్పుల్లో కాళ్ళుపెట్టుకుని కూచున్నాక యిక నీతో చెప్పవలసింది యేమీ లేదు. అయినా చిన్న కోరిక. ఏమంత విశేషం లేదు గాని - అయినా యెక్కడికక్కడికే సంతృప్తి. ఎంతచెట్టు కంతేగాలి కదా? చెప్పవచ్చిందేమీ లేదు. నగలు - ఏమున్నాయి? ఏదో పేరు. అయినా వున్నమట్టుకు బంగారం కోసం చేయించేను. అవి దానివే. ఎవరికీ యివ్వవద్దు. అయ్యా! మీరు చాలామంది వింటున్నారు. పెద్దన్నయ్యా! నువ్వు గూడా విను. నేను మామకూతురు బంగారం కోసం కొంచెం నగలు చేయించేను. అవి దానికిచ్చేశాను. వాట్లకోసం యెవరూ ఆశపడవద్దు. మీరంతా సాక్ష్యం. అవి నా

స్వార్జితం. నా చిత్తం వచ్చినట్లు చేసుకున్నాను. అవి బంగారం ధరిస్తే - ధరించి - అంతే చాలు”

ఇదివిని బంగారమ్మ కాంతమ్మ గొల్లుమనిరి. అందఱును ఊరడింపజూచిరి; గాని ప్రయోజనము కలుగలేదు.

అందఱును చూచుచుండగా పేరుభట్టు బంగారమ్మ చేతులు పట్టుకొనియే యుండి ప్రాణములు విడిచెను.

❀ ❀ ❀